క్లుప్తంగా

బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలకు ఆహ్వానం

శంషాబాద్: మాస్టర్ క్లాసిక్–2023 బాడి బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను మార్చి 5 నుంచి పట్టణంలోని జెడ్పీమైదానంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మహ్మద్ నజ్మొద్దీన్ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. పోటీలో ఐదు రకాల పతకాలతో పాటు నగదు బహుమతి ఉంటుందన్నారు. వివరాలకు 7997869091, 9848813075 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే బస్తీ సర్వే



ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ వైర్లను చూపిస్తున్న నాయకులు, స్థానిక ప్రజలు.

రాజేంద్రనగర్: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు బస్తీ సర్వేలు చేపడుతున్నామని సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జి.కురుమయ్య, సిఐటియూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్ర కుమార్‌లు వెల్లడించారు. స్థానిక సమస్యలపై పలు బస్తీలలో సర్వే చేపట్టారు. శుక్రవారం శివరాంపల్లి అర్జున్ బస్తీలో నాయకులు, ప్రజలతో కలిసి పర్యటించారు. కరెంటు వైర్లు అడ్డదిడ్డంగా ఉన్నాయని, వీధి దీపాలు వెలగడం లేదని, స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాదంగా మారాయని వారి దృష్టికి తీసుకువచ్చారు.

మిల్లెట్స్‌పై అవగాహన



సాక్షి సిటీబ్యూరో: మిల్లెట్స్ అంతర్జాతీయ దినోత్సవంను పురస్కరించుకుని నయా మిల్లెట్స్.. కామధేను ప్యూర్లీ నేచురల్స్ పేరిట '365 రోజులు..365 స్థలాలు..365 మందికి' అనే మెసేజ్‌తో శుక్రవారం అంజన్‌కుమార్ అనే వ్యక్తి అశోకా లివియానో టవర్స్‌లో రాగి ఇడ్లీ, పొంగల్, కిచిడీ అందజేశారు. ఈ సందర్భంగా గోవు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు.

శివ పూజకు వేళాయె..



పూజల్లో పాల్గొన్న ప్రణవ భక్త సమాజం సభ్యులు, భక్తులు



హోమం పూజల్లో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి మహాశివరాత్రి

మహాశివరాత్రి సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో శివాలయాల్లో పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం తెల్లవారుజామునుంచే శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. జాగారణ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో శుక్రవారం మహాశివరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. హైదర్‌గూడ శ్రీ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వజారోహణ, అభయ గణపతి అభిషేకం, అంజనేయ స్వామికి, ఉమామహేశ్వరి మాతకు అభిషేకం, గణపతి హోమం, మహా రుద్రాయో హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం శివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుంచే వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్, పూలతో అందంగా ముస్తాబు చేశామన్నారు. ఈ పూజల్లో ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు మోండ్ర నర్సింహ్మా, ఉపాధ్యక్షులు బర్ల మల్లారెడ్డి, సనివెల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి పుస్తకా అశోక్ పాల్గొన్నారు.

మణికొండ: గండిపేట మండల పరిధిలోని శైవ క్షేత్రాలు సిద్ధమయ్యాయి. దేవాలయాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయాల కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మణికొండ శ్రీపార్వతీరామలింగేశ్వరాలయం, పుప్పాలగూడ కాశీవిశ్వేరాలయం, నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవులలోని మచిలేశ్వరాలయాలను ఉత్సవాలకు సిద్ధం చేశారు. ఆయా దేవాలయాల్లో తెల్లవారు జామున 4గంటల నుంచే ప్రత్యేక అభిషేకాలకు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆయా దేవాలయాల వద్ద రంగురంగుల దీపాలు, చాయా చిత్రాల కటౌట్‌లు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అధికసంఖ్యలో తరలివచ్చే భక్తులకు అనుగుణంగా క్యూలైన్లను ఏర్పాటు చేశామని ఆలయ పూజారులు, ధర్మకర్తలు, పాలక కమిటీలు తెలిపాయి.



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



శంషాబాద్ మండలం పెద్దగోల్కొండలో పండ్ల పంపిణీ



బండ్లగూడ జాగీర్‌లో అన్నదానం

రాజేంద్రనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారు. మైలార్‌దేవ్‌పల్లి మైనార్టీ విభాగం నాయకుడు హతహుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొని కేక్‌కట్ చేశారు. పార్టీ నాయకులు సరికొండ వెంకటేష్, మాజీ కౌన్సిలర్ వెంకటేష్, విజయ్‌కుమార్, యాదగిరి, అడికే అర్జున్, సూర్యంతో పాటు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శాస్త్రీపురంలో జరిగిన కార్యక్రమంలో ముక్రం ఖాన్ పాల్గొని కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు పోరెడ్డి ధర్మారెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

మైలార్‌దేవ్‌పల్లి: అన్నిదానాల్లో రక్తదానం ఎంతో గొప్పదని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన సందర్భంగా శివరాంపల్లిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అలాగే బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.



మణికొండలో..

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు తదితరులు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ట్యాంక్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు, ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దుగ్యాగల రాం ప్రసాద్‌తో కలసి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే రోడ్డుపై వాహనాలు నడిపే విధానం, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా, ట్రిపుల్ రైడ్, రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి చట్టపరమైన కఠిన శిక్షలు అమలు చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్సులను రద్దుచేసే అవకాశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరి దేవి, వైస్ ప్రిన్సిపాల్ సీవీవీ ప్రసాద్, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మయ్యలతో పాటు ట్రాఫిక్ పోలీసులు విజయరామరాజు, ఎస్‌ఐ.జ్యోతి, ఎస్.వెంకటప్రసాద్, చక్రధర్ పాల్గొన్నారు.

సేవాలాల్ చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి

గన్‌ఫౌండ్రీ: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆ రోజును సెలవుదినంగా ప్రకటించాలని కేంద్ర మాజీ మంత్రి రవీందర్‌నాయక్ కోరారు. శుక్రవారం రవీంద్రభారతిలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారాహిల్స్‌లో సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ మహరాజ్ చరిత్రను పాఠ్యాంశంలో చేర్చడంతో పాటు ఆయనపై పోస్టల్ స్టాంప్ విడుదల చేసేలా బంజారా సోదరులు కృషి చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ కమిషనర్ ప్రకాష్ రాథోడ్, విశ్రాంత ఐపీఎస్ అధికారి జగన్నాథ్, బంజారా సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు

రాజేంద్రనగర్: మహాశివ రాత్రిని పురస్కరించుకోని ప్రజాహిత బ్రహ్మకుమారిస్ ఈశ్వరియ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హైదర్‌గూడలో కేదార్‌నాథ్ దేవాలయం నమూనాను ఏర్పాటు చేశారు. దేవాలయం సెట్‌ను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి శివలింగాన్ని ప్రతిష్టించి భక్తుల దర్శనార్థం రెండు రోజుల పాటు అవకాశం కల్పించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా స్థానిక ప్రాంతాలకు చెందిన విద్యార్థులు నిర్వహించిన శివ తాండవం భక్తిగీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

వీధి కుక్కల సమస్యకు పరిష్కారం



వట్టినాగులపల్లిలో కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్, కమీషనర్‌లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖయాదగిరి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వట్టినాగులపల్లి గ్రామంలో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె కమీషనర్ ఎ.సత్యబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో వీధి కుక్కల సమస్య అధికంగా ఉండటంతో వాటి సంఖ్యను తగ్గించటం, వారితో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను దూరం చేయాలనే ఉద్దేశంతో బ్లూక్రాస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామన్నారు. వారు వార్డుల వారిగా కుక్కలను పట్టుకుని వ్యాక్సినేషన్ ఇచ్చి వదలిపెడతారన్నారు. కౌన్సిలర్ బి.యాదమ్మ, డీఈ నరసింహారాజు, బ్లూక్రాస్ ప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులపై దాడి ఘటనలో కేసు నమోదు

శంషాబాద్ రూరల్: వరదనీటికి అడ్డుగా మట్టి పోయగా.. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన వారిపై దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్కూడ శివారులో శంషాబాద్–షాబాద్ రహదారి అనుకుని ఉన్న భూమిలో పట్టాదారులు రాత్రి వేళ మట్టి నింపారు. పక్క నుంచి వెళ్లే వరదకాలువ నీరు ఈ మట్టి కారణంగా నిలిచిపోతుందని స్థానిక రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై శుక్రవారం అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులపై కొందరు మధ్యవర్తులు బూర్కుంట సంజీవ, బూర్కుంట నాగేశ్, బూర్కుంట శ్రీధర్ దాడి చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాయిస్ ఆఫ్ హైదరాబాద్ పోస్టర్ విడుదల



వాయిస్ ఆఫ్ హైదరాబాద్ పోస్టర్‌ను విడుదల చేసిన అధ్యాపకుడు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) విద్యార్థులు శుక్రవారం కళాశాలలో వాయిస్ ఆఫ్ హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కె.జగన్నాథరావు మాట్లాడుతూ పదాలు విఫలమైనప్పుడు సంగీతం మాట్లాడుతుందని, సంగీతం అన్ని రకాల వ్యక్తులను కలుపటంతో పాటు సందేశాన్ని వ్యాప్తి చేస్తుందన్నారు. వాయిస్ ఆఫ్ హైదరాబాద్‌కు సంగీత కారులందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. మార్చి 18వ తేదీన కళాశాలలో ప్రదర్శన ఉంటుందన్నారు. సమన్వయ కర్త డాక్టర్ ఎ.వాణి, పీఆర్‌ఓ డాక్టర్ జీఎన్‌వీ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

'కేంద్రం పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'



ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మల్లారెడ్డి

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి గౌరిగె రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నందిముస్లాయిగూడలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ నిరుపేదల కుటుంబాలకు అండగా ఉండేందుకు ప్రధానమంత్రి మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను తెలంగాణ విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాబాద విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మిషన్ లైఫ్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ప్రిన్సిపల్ సెక్రటరీ, ఈపీటీఆర్‌ఐ డైరెక్టర్ జనరల్ వాణి ప్రసాద్ తదితరులు

గచ్చిబౌలి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈపీటీఆర్‌ఐ సైంటిస్టులు విద్యార్థులకు వివరించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్‌ని బాచుపల్లి ఓక్రిడ్జ్ విద్యార్థులు సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ దిశగా పనిచేస్తున్న మిషన్ లైఫ్ గురించి సైంటిస్టు సునీల విద్యార్థులకు వివరించారు. జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడం, నీటిని సంరక్షించడం, హెర్బల్ గార్డెన్, వేస్ట్ రీసైక్లింగ్ కాంప్లెక్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ గురించి వివరించారు. ప్రతి ఒక్కరు పర్యావరణ స్పృహతో జీవించాలని, మిషన్ లైఫ్ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ, ఈపీటీఆర్‌ఐ డైరెక్టర్ జనరల్ వాణిప్రసాద్ సూచించారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజలంతా పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచించారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలో మెట్లకుంట చెరువులో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బందితో కలిసి డ్రోన్ యంత్రం సహాయంతో శుక్రవారం దోమల మందు పిచికారీ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమల బెడద నివారణలో ప్రజలంతా సహకరించాలన్నారు. జీహెచ్‌ఎంసీ, ఎంటమాలజీ విభాగం చేపడుతున్న చర్యలతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే దోమలను చాలా వరకు నియంత్రించవచ్చన్నారు. ఇంటితోపాటు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్ విశ్వప్రసాద్, నర్సింహులు, యాదగిరి తిమోతి, స్థానికనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



తేజస్వీనగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్

రాజేంద్రనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. శుక్రవారం తేజస్వీనగర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కొంత కాలంగా తేజస్వీనగర్‌లో రోడ్డు సమస్య తీవ్రంగా ఉందన్నారు. తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాల రాకపోకలు ఇబ్బందులు ఎదురవుతుండడంతో అధికారులతో చర్చించి నిధులను మంజూరు చేయించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కాడెం సుధాకర్, స్టార్ చిన్నా పాల్గొన్నారు.

దేశ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం
- సీఎం కేసీఆర్ బర్త్ డే కేక్ కట్ చేసిన గాంధీ



కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో కేసీఆర్ బర్త్ డే కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: కేసీఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కేసీఆర్ విజన్‌తో అభివృద్ధిలో పరుగులు పెడుతున్న తెలంగాణ రాష్ట్రం యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జనరంజక పాలనతో తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నారని ఆయన కొనియాడారు. మెగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన 200 మందిని ఆయన అభినందించారు. అన్ని దానాల కన్న రక్త దానం గొప్పదని, ప్రతి ఒక్కరు సామాజిక స్పృహతో రక్త దానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు అనంతరం కేసీఆర్ బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. కొండాపూర్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వరదాచారి, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.